క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


అయ్యప్పస్వామి

కొత్తపేట: స్థానిక బోడిపాలెం గౌతమి అయ్యప్పస్వామి వారి ఆలయం 11 వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు అయ్యప్ప స్వామికి ఉదయం పంచామృతాలతో అభిషేకం, విశేష పూజలు, విశేష అలంకరణ, మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. 11 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు. కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు, అయ్యప్ప భక్తులు వివిధ సేవల్లో పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు కోరారు.

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు జరిగింద. స్థానిక ఎస్‌పీబీకే సత్యనారాయణరావు కమ్యూనిటీ హాలులో సోమవారం కపిలేశ్వరపురం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యుల బృందం విచ్చేసి 72 మంది రోగులకు చికిత్స అందజేసి ఉచితంగా మందులను, కళ్లజోళ్లను పంపిణీ చేశారు. అందులో అవసరమైన 22 మందిని చికిత్స నిమిత్తం కపిలేశ్వరపురం కంటి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సుధారాణి, విజయ్ సునంద్, కొండలరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి సాయం


బాధితురాలి మావయ్యకు చెక్కు అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.18 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. జంగారెడ్డిగూడేనికి చెందిన పట్నాల జాహ్నవి శ్రీ సాయి ప్రశాంతి(9)కి రెండు కిడ్నీలు పాడయిపోయి కిడ్నీ మార్చుకోవాలని వైద్యులు తెలిపారు. అప్పటి వరకు డయాలసిస్ చేయించుకోవాలి నెలకి రూ.30 వేల వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి, ఇప్పటికే రూ.6 లక్షల వరకు ఖర్చు పెట్టారు. దీంతో ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. ఈరోజు రావులపాలెంలో జాహ్నవి మావయ్య ఖండవల్లి శ్రీనివాసుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.18 వేలు విలువైన చెక్కు అందజేశారు.

డిగ్రీ కళాశాలలో జాతీయస్థాయి వెబినార్

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ కోఆర్డినేటర్ కె.రజని, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ యు.సుభాషిణి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాతీయ స్థాయి వెబినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జాతీయ స్థాయి ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, పేటెంట్స్ డిజైన్ ఫీలింగ్ అనే అంశంపై ఆన్‌లైన్‌లో వెబినార్ నిర్వహించారు. దీనికి ప్రత్యేక స్పీకర్‌గా నాగపూర్‌కు చెందిన కుమార్‌రాజు అసిస్టెంట్ కంట్రోలర్ పేటెంట్స్ అండ్ డిజైన్, రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రాపర్టీ మేనేజ్మెంట్ ఆన్‌లైన్లో మేధోసంపత్తి హక్కులపై వివరించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ వెబినార్లో సుమారుగా 350 మంది పాల్గొని, విషయాలను తెలుసుకుని నివృత్తి చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్ బాబు, బీపీఎస్ రెడ్డి, హరిబాబు, సోనీ, సుమలత, రజని, శ్రీనివాస్, దుర్గాదేవి, సిద్ధార్థ, రాజేంద్ర, సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిబాట, బంగారుబాట

సఖినేటిపల్లి: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిబాట, బంగారుబాట కార్యక్రమాన్ని కేశవదాసుపాలెంలో యెనుముల వారి మెరక మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు. ఎంఈఓ-1 డి.కిషోర్ కుమార్, ఎంఈఓ-2 మద్దాలి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి, భవితకు బంగారు బాట వేసుకోండి అంటూ ఇంటింటా ప్రచారం ఉపాధ్యాయులు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో లభించే నాణ్యమైన ఉచిత విద్యను తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు కోరారు. ఈ మేరకు పిల్లలను చేర్పిస్తూ ముందుకు వచ్చిన తల్లితండ్రులకు తగిన అడ్మిషన్ పత్రాలను సర్పంచ్ మేడిది సరోజ అందించారు. పాఠశాల హెచ్ఎం జి.రజనీకుమారి, ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.రామరావు, టీచర్లు రాజబాబు, సోమశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, నాగజ్యోతి, విద్యాశాఖ స్టాఫ్ బి.శ్రీనివాస్, బి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

తాపానికి ఉక్కిరిబిక్కిరి

- గ్రీష్మతాపంతో జనం విలవిల
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కబోత
- ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా రహదారులు


నిర్మానుష్యంగా మారిన ఈతకోట-గంటి రోడ్డు


రావులపాలెం వద్ద జాతీయ రహదారిపై వ్యాన్‌లో ఎండ వేడికి తట్టుకోలేక ముఖానికి టవల్ కట్టుకున్న వ్యక్తి


రావులపాడు వద్ద జాతీయ రహదారిపై తలకు క్యాప్, టవల్ కట్టుకుని వెళుతున్న చిరు వ్యాపారి

రావులపాలెం: భానుడు భగభగలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఎండలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే తాపం ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. 40 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి తాపంతో శీతల పానీయాలు, పండ్ల రసాలు, కొబ్బరికాయల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. నదీతీరాలకు, పార్కులకు సమీపంలోని వారు చల్లగాలి కోసం అక్కడికి వెళ్లి సేదతీరుతున్నారు. తప్పనిసరి పనులపై బయటకు వచ్చే వాహనచోదకులు, ప్రయాణికులు ముఖానికి రుమాళ్లు కట్టుకుని ప్రయాణిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులతో వడదెబ్బ, డీహైడ్రేషన్ సాధారణంగా సంభవిస్తాయి. సరైన సమయంలో చికిత్స తీసుకోకనోతే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడం జరుగుతుంది.

వడదెబ్బ సోకకుండా

నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. లేత వర్ణాలు, తేలికైన, కాటన్ దుస్తులు ధరించాలి. రోజూ కనీసం 15 గ్లాసులు నీళ్లు తాగాలి. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. శుభ్రంగా రెండు పూటలా స్నానం చేయాలి.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ఎండలు తీవ్రంగా ఉన్నందున గాలిలో తేమ శాతం తగ్గుతుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ వల్ల వడదెబ్బకు గురికాకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. పండ్లు, తాజా ఆహారపదార్థాలు తీసుకోవాలి. ఎండ తీవ్రత పెరిగితే చిన్నారులు, వృద్ధులు పొలాల్లో పనులు చేసే కూలీలు వడగాడ్పులకు గురయ్యే అవకాశం ఉంది. దీన్ని గమనించి వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలు బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీళ్లు తాగించకూడదు. వీలైనంత త్వరగా సమీప పీహెచ్‌సీకి లేదా ఆస్పత్రికి తరలించాలి.

– ఎంఆర్‌ఎల్ భీమారెడ్డి, వైద్యుడు, రావులపాలెం

ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు


మామిడికుదురులో ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

మామిడికుదురు: కాపు, బీసీ, ఈబీసీ తదితర సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల ఎంపికకు మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో దరఖాస్తుదారులను బ్యాంకర్లు ఇంటర్వ్యూ చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరవాక, గోగన్నమఠం, లూటుకుర్రు, ఆదుర్రు, కొమరాడ గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులతో బ్యాంకు అధికారులు నేరుగా మాట్లాడారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మగటపల్లి, మాకనపాలెం, గెద్దాడ, ఈదరాడ గ్రామాలకు చెందిన వారితో బ్యాంకర్లు ముఖాముఖి మాట్లాడారు. సుమారు 800 మంది దరఖాస్తుదారులు ఎంపీడీఓ కార్యాలయానికి రావడంతో మండల పరిషత్ కార్యాలయం సందడిగా మారింది. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీపీ కుసుమ వనజకుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

‘నీతిపూడి’ సేవలు చిరస్మరణీయం


పి.గన్నవరంలో నీతిపూడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం/మామిడికుదురు: నిరంతరం ప్రజా సమస్యల కోసం శ్రమించిన మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు పేదల పక్షపాతిగా ఎంతో గుర్తింపు పొందారని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పి.గన్నవరం మండల అంబేడ్కర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.10 లక్షలతో పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడెక్టు వద్ద ఏర్పాటు చేసిన నీతిపూడి గణపతిరావు నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. శిలా ఫలకాన్ని జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు ప్రారంభించారు. ఇంటర్మీడియెట్ బోర్డు రిటైర్డ్ ఆర్ఐఓ యల్లమెల్లి అర్జునుడు ఆడిటోరియంలో జరిగిన సభకు సరెళ్ల ఆనందశాస్త్రి అధ్యక్షత వహించారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అవసరం వచ్చినా వారికి అండగా ఉండడంలో నీతిపూడి మొదటి స్థానంలో నిలిచే వారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, కొండేటి చిట్టిబాబు, స్థానిక సర్పంచ్ బొండాడ నాగమణి, అంబేడ్కర్ అభిమాన సంఘం నాయకులు కోట రామ్మోహనరావు, నక్కా వెంకటేశ్వరరావు, కొక్కిరి రవి, యన్నాబత్తుల నాగరాజు, యన్నపు పెద్ద తదితరులు పాల్గొన్నారు. ముందుగా నీతిపూడి గణేష్‌బాబు ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా విగ్రహావిష్కరణకు తరలి వచ్చారు. సమావేశం అనంతరం గణేష్‌బాబు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


పుల్లేటికుర్రులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

అంబాజీపేట: మానసికోల్లాసం కోసం ఆడే క్రీడా పోటీల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీలు బుడితి సత్యనారాయణమ్మ, వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని పుల్లేటికుర్రు సర్పంచ్ బాలరాజు ఆధ్వర్యంలో భీమ సేన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను సోమవారం ప్రారంభించారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో గిడ్డి ఆనంద్, అక్కిశెట్టి ప్రసాద్, కాండ్రేగుల గోపాలకృష్ణ, అందే వెంకటముక్తేశ్వరరావు, గంటి బాలయోగి, భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధిలో పాటురేవు అభివృద్ధి పనులు


పాటురేవు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగాలక్ష్మి

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పాటురేవు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి తెలిపారు. పాటురేవు అభివృద్ధి పనులను ఆమె సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గోదావరి నదీతీరంలోని శ్మశాన వాటిక నుంచి రజక చెరువు వరకు పాటు రేవులో ఉపాధి హామీలో అభివృద్ధి పనులు నిర్వహిస్తారన్నారు. రూ.1.60 లక్షల అంచనా వ్యయం, 580 పని దినాలతో రెండు వారాల పాటు ఈ పనులు జరుగుతాయని చెప్పారు. కూలీలు పనులు చేసే చోట వారికి ఎండ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. కూలీలకు అవసరమైన తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడేపల్లి చిన్న, గెద్దం వెంకటేశ్వరరావు, బత్తుల జనార్దనరావు, వార్డు సభ్యులు వేగి నాగమణి, పాటి గోవిందు, ఫీల్డ్ అసిస్టెంట్ మట్టా నాగబాబు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లు అందించాలి


వితంతు పింఛన్లు మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్న పాశర్లపూడికి చెందిన వితంతువులు

మామిడికుదురు: వితంతు పింఛన్లు అందించి ఆదుకోవాలంటూ పలువురు మహిళలు డిమాండ్ చేశారు. పాశర్లపూడికి చెందిన ఈతకోట వెంకటలక్ష్మి దీనిపై సోమవారం కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. 2007 ఏప్రిల్ 14న తన భర్త భాస్కరరావు మృతి చెందారని చెప్పారు. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు తనకు వితంతు పింఛన్ మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెతో పాటు అదే గ్రామానికి చెందిన మోడా పైడమ్మ, అంకాని కాసులమ్మ, మందపాటి సత్యవతి, నేదునూరి ప్రభావతి, ఈతకోట వెంకటలక్ష్మి, అంగాని నాగమణి, దిగుమర్తి పెద్దింట్లు, పిల్లి బేబి సరస్వతి కూడా తమకు వితంతు పింఛన్లు మంజూరు చేయాలని వేడుకున్నారు. ఎన్నిసార్లు దరఖాస్తులు చేసినా విడో పింఛన్లు ఇవ్వకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై అధికారులు స్పందించి తమకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు.

దేవస్థానం పనులకు టెండర్ కం బహిరంగ వేలం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వివిధ పనులకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో సోమవారం దేవస్థానం అధికారులు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఆయా పనులు నిమిత్తం లైసెన్స్ హక్కులు పొందేందుకు దేవదాయ శాఖ ఈఓ టి.నాగవిష్ణు పర్యవేక్షణలో పై కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా ఒక సంవత్సరం కాలపరిమితికి గాను ఆలయంలో పెండ్లి మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు, దేవస్థానం పరిధిలోని కొబ్బరి చెట్ల ఫల సాయం తీసుకునే హక్కు నిమిత్తం టెండర్లు ఖరారు చేశారు. సరైన ధరలు రానందున ఫొటోలు, ఫ్యాన్సీ సామగ్రి అమ్ముకునే హక్కు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు, ప్రింటింగ్, స్టేషనరీ సామగ్రి సరఫరా చేసే హక్కుకు సంబంధించిన టెండర్లు వాయిదా వేసినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ ఒడుగు శ్రీనివాస్, స్టాఫ్ పి.విజయ సారథి, ఎం.సత్యకిరణ్, జి.శ్రీనివాస్, పి.సత్తిబాబు, టెండరు దారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


పెదపళ్ల పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రపంచ మానవాళి ఆరోగ్య రక్షణ హక్కు కోసం 1948 ఏప్రిల్ ఏడున డబ్ల్యూహెచ్ఓ నెలకొల్పిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఏటా జరుపుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా డబ్ల్యూహెచ్ఓ పిలుపు మేరకు కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత ఆదేశాలతో ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకర ఆరంభాలు–ఆశాజనక భవితవ్యాలు అంటూ నినాదాలు చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాల పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మాతా శిశుసంరక్షణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్.రెడ్డి,, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

నాగుల్లంకలో..

పి.గన్నవరం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగుల్లంక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తు అనే నినాదంతో ర్యాలీ జరిగింది. తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తల్లి, నవజాత శిశువుల మరణాలను అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రియాంక సూచించారు. ర్యాలీలో డాక్టర్లు మహ్మద్ రియాజ్ తున్నిషా బేగం, మౌనిక, ట్రైనీ డాక్టర్స్, ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, ఎంపీహెచ్ఎస్ బీవీవీఎస్ఎన్ మూర్తి, కేసీహెచ్ మరియమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే

అంబాజీపేట: ప్రస్తుత విభిన్న వాతావరణంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి పి.రవికుమార్, వెంకటేష్ అన్నారు. ముక్కామల పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీని సోమవారం నిర్వహించారు. మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ నినాదించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, మన ఆరోగ్యం మన ఆహారపు అలవాట్లపై ఆధారపడి ఉంటుందని అన్నారు. మంచి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాటిపాకలో..

రాజోలు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం తాటిపాక పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మానస సుప్రియ ర్యాలీని ప్రారంభించారు. పీహెచ్‌సీ ద్వారా అందిస్తున్న ఆరోగ్య సేవలను వివరించారు. సీహెచ్ఓ ఎలిజబెత్, పీహెచ్ఎన్ ఎ.సత్యవతి, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


పలివెలలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ట్రస్ట్, ఆలయ కమిటీ సభ్యులు

కొత్తపేట: మండలంలోని పలివెలలో కోదండరామస్వామి వారి ఆలయం (ముసలి రామాలయం) వద్ద పంచముఖ ఆంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సీఎస్ఎస్ ట్రస్ట్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 27 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని నెలకొల్పారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాలు ఈ నెల 5 నుంచి ప్రారంభించారు. మధ్యలో ఆదివారం శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం ఘనంగా జరిపారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి వైదిక స్మార్త ఆగమ పండితుడు బ్రహ్మశ్రీ కొంపెల్ల రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ఆలయ కమిటీ సభ్యుల దంపతులతో వివిధ పూజలు, హోమాలు, జరిపారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీపీ మార్గన గంగాధరరావు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ చవల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. ప్రతిష్ఠను పురస్కరించుకుని మంగళవారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ సెక్రటరీ భమిడిపాటి దుర్గాలక్ష్మీ నారాయణ తెలిపారు.

స్టూడెంట్ కిట్లు అందరికీ చేరాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్‌ఘని

అంబాజీపేట: రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి స్టూడెంట్స్ కిట్లను ప్రతి విద్యార్థికి చేరేలా తగు చర్యలు తీసుకోవాలని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర-1 రాష్ట్ర పరిశీలకుడు షేక్ అబ్దుల్‌ఘని అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, సీఆర్పీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మండలానికి వచ్చే స్టూడెంట్స్ కిట్లను తరగతి గదుల్లో భద్రపరిచేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, బెల్ట్, బూట్లు, డిక్షనరీలు తదితర వస్తువులను భద్రపరచడంలో అశ్రద్ధ వహించవద్దన్నారు. పాఠశాల తెరచే నాటికి పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంటాయని అన్నింటిని కలిపి విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. అనంతరం కిట్లను భద్రపరిచే గదులను పరిశీలించారు. అలాగే మండలంలో ఉన్న విద్యార్థుల వివరాలు, మండల లెవెల్ విద్యా కమిటీల రెజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంఓ బీవీ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి హెచ్ఎం బి.వెంకటేశ్వరరావు, సీఆర్ఎంటీస్, ఎంఆర్సీ స్టాఫ్ పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికపై డ్వాక్రా మహిళలకు అవగాహన


డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీసీ వెంకటలక్ష్మి


అయినవిల్లి: మండలంలోని డ్వాక్రా మహిళలకు 2025-26 ఆర్థిక ప్రణాళిక, రుణాలు ఎంత అవసరమో అనే అంశాలపై సీసీ కె.వెంకటలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సు అయినవిల్లిలోని రామాలయం వద్ద జరిగింది. డ్వాక్రా సంఘాల మహిళలతో సీసీ వెంకటలక్ష్మి మట్లాడుతూ తమ సొంత జీవనోపాధులకు అవసరమైన రుణాలు, కుటుంబ సభ్యుల ఆదాయ వనరులు, పెంచుకోవడం కోసం, ఇంటి అవసరాలకు, పెళ్లి చదువు, ఏదైన ఆస్తి కొనుగోలుకు, ఇల్లు నిర్మించుకోవడానికి, ఇతర అవసరాలకు, ఉత్పత్తుల తయారీకి కావాల్సిన రుణాలపై ఆమె అవగాహన కల్పించారు. ప్రతి ఐదు డ్వాక్రా సంఘాలకు ఐదు ఎన్యూమరేటర్లను ఏర్పాటు చేశారు. వీరు సభ్యురాలి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారన్నారు. అలాగే ప్రతి కుటుంబం స్థితిగతులపై సర్వే చేస్తారన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల ఊరేగింపు


తూర్పుపాలెంలో రథంలో ఊరేగుతున్న సీతారాములు

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెం, కేశనపల్లి గ్రామాల్లో సీతారాముల ఊరేగింపు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం కల్యాణం నిర్వహించిన నేపథ్యంలో ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై సీతారాముల దంపతులను ఊరేగించారు. ఆయా గ్రామాల్లోని ప్రధానాలయాల వద్దకు రథం వెళ్లి అమ్మవార్లను దర్శనం చేయించారు. ఆయా గ్రామ పెద్దలు, అర్చకులు ఊరేగింపులలో పాల్గొన్నారు. రాత్రి వరకూ ఊరేగింపు జరిగింది.

ఆకట్టుకున్న 'రాజసయోగం మయసభ'


'రాజసయోగం మయసభ' నాటిక ప్రదర్శన

సఖినేటిపల్లి: మహాభారతంలోని 'రాజసయోగం మయసభ' నాటిక ఆకట్టుకుంది. శ్రీరామనవమి ఉత్సవాలు పురస్కరించుకుని మోరి లింగమ్మ చెరువు సీతారామస్వామి ఆలయం వద్ద నాటిక ప్రదర్శన చేశారు. దుర్యోధనుడి పాత్రలో న్యాయవాది యాలంగి రమేష్, భానుమతిగా కల్యాణి, సహాయ నటులుగా రమణి, బళ్ల పర్వతాలు, విశ్వనాథం నటించారు. యాలంగి సుమిత్‌రామారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శనలు చేస్తున్నామని రమేష్ వివరించారు. నాటక రంగ వైభవాన్ని భావితరాలకు వివరించాలనే ప్రదర్శనలు చేస్తున్నామన్నారు. నాటిక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను శ్రీరామ శెట్టిబలిజ సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు.

కనకదుర్గమ్మకు లక్ష చామంతి పూజ

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలో కొలువుదీరిన కనకదుర్గమ్మకు చైత్ర శుద్ధ దశమి సందర్భంగా వసంతోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కనకదుర్గమ్మకు ఏకాదశ రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, నవదుర్గారాధన, అభిషేకాలు, తదుపరి లక్ష చామంతి పూజ, లలితా హోమం పూజలను అంగరంగ వైభవంగా జరిపించారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ వసంతోత్సవం పూజలు జరిగాయి. పలువురు భక్తులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. అమ్మ వారిని దర్శించుకుని అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.